సాక్షి జగిత్యాల

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



అంజన్న ఆదాయం రూ.1.08కోట్లు

కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయానికి 81 రోజులకు గాను హుండీలద్వారా వచ్చిన ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 10లో▸



లోక కల్యాణ్ మేళా

పీఎం స్వనిధి స్థానంలో లోక కల్యాణ్ పేరిట కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వనుంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

రాజరాజేశ్వరుని సన్నిధిలో మంత్రి అడ్లూరి



రాజరాజేశ్వరున్ని దర్శించుకుంటున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వర స్వామిని సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి స్వామివారి ప్రసాదం అందించారు.

గురుకులాలకు రూ.60 కోట్లు

గురుకులం పాఠశాలలు, కళాశాలల్లో వసతులకు సీఎం రూ.60 కోట్లు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఎస్సీ, బీసీ సొసైటీలకు రూ.20 కోట్లు, ఎస్టీ, మైనార్టీ సొసైటీలకు రూ.10 కోట్ల చొప్పున మంజూరయ్యాయన్నారు.

విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు

జగిత్యాలక్రైం: ఈనెల 21న పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం 'పోలీస్ ఫ్లాగ్ డే' సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. పోటీ తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఉంటుందని, 6వ తరగతి నుంచి పీజీ విద్యార్థులు పాల్గొనవచ్చని, తమ వ్యాసాలను ఈనెల 28 లోపు సమర్పించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు. 'డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర.. 'విద్యార్థులు డ్రగ్స్ నుంచి ఎలా దూరంగా ఉండగలరు..' అనే అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందని, ఆసక్తి గల వారు https://forms.gle/jaWdt2yhNrMpe3A లింక్‌పై క్లిక్ చేసి చేసి పేరు, విద్యార్హత, ఇతర వివరాలు నమోదు చేయాలని, వ్యాసాన్ని 500 పదాలకు మించకుండా పేపర్‌పై రాసి, దానిని ఫొటోతీసి ఇమేజ్/పీడీఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడే అవకాశం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జగిత్యాల: సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని ఐఎంఏ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్ వారికి సోమవారం అవగాహన కల్పించారు. గుండెపోటు బారిన పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్షించేందుకు సీపీఆర్ ఉపయోగపడుతుందన్నారు. కోశాధికారి సుధీర్‌కుమార్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన బీసీ సంఘాలు



ఆందోళన చేస్తున్న బీసీ సంఘం నాయకులు

కొడిమ్యాల: రిజర్వేషన్ల విషయంలో బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని పేర్కొంటూ మండలంలోని పూడూర్‌లో కరీంనగర్ – జగిత్యాల రహదారిపై సోమవారం బీసీ నాయకులు బైఠాయించారు. ప్రభుత్వం ఖరారు చేసిన 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, నోటికాడి ముద్ద లాక్కోవద్దని, బీసీలను చిన్నచూపు చూడొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బింగి మనోజ్, రాచకొండ చందు పాల్గొన్నారు.

పట్టణం.. కళావిహీనం

- కనిపించని సుందరీకరణ
- పనిచేయని ఫౌంటేన్స్
- డివైడర్లలో ఏపుగా కానోకార్పస్
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



డివైడర్ల మధ్య ఏపుగా పెరిగిన కోనాకార్పస్ చెట్లు



పాతబస్టాండ్ వద్ద కళావిహీనంగా ఉన్న జంక్షన్, పనిచేయని ఫౌంటేన్

జగిత్యాల: పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అంటూ మున్సిపల్ అధికారులు చెబుతుంటారు. వారరే పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లా కేంద్రమైన జగిత్యాల సుందరీకరణ పేరుతో గతంలో సుమారు రూ.10 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. కొత్తబస్టాండ్ పాతబస్టాండ్ వద్ద జంక్షన్లు నిర్మించి అందులో పక్షుల బొమ్మలు, రాతి కట్టడాలు, ఫౌంటేన్లను అందంగా ముస్తాబు చేశారు. అనంతరం వాటి నిర్వహణ మర్చిపోవడంతో ప్రస్తుతం కళావిహీనంగా మారాయి. ఫౌంటేన్ ఒక్కసారి కూడా పనిచేయడంలేదు. స్థానికులెవరైనా ఫిర్యాదు చేస్తే అడపదడపా వచ్చి ఫౌంటేన్ ప్రారంభించి వదిలేస్తుంటారు. అందులో ఉన్న పచ్చిగడ్డి ఎండిపోయింది. బొమ్మలు దుమ్ము, ధూళితో కళాహీనంగా మారాయి.

ఏపుగా పెరుగుతున్న కానోకార్పస్ చెట్లు

జిల్లా కేంద్రంలో ఎప్పటికప్పుడు పిచ్చిమొక్కలను తొలగించడంతోపాటు, డివైడర్ల మధ్యనున్న చెట్లను తొలగిస్తుండాలి. వాటిని పట్టించుకోకపోవడంతో కానోకార్పస్ మొక్కలు ఏపుగా పెరిగాయి. కొత్తబస్టాండ్ నుంచి నిజామాబాద్ వెళ్లే రహదారితోపాటు, కరీంనగర్ వెళ్లే రహదారిలో కుడి, ఎడమ రహదారుల వైపు వెళ్లేవారు మచ్చుకైనా కన్పించరు. పైగా అందులో అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో కొత్తబస్టాండ్ నుంచి పాతబస్టాండ్‌కు వెళ్లే దారిలో సుమారు రూ.12 లక్షల వ్యయంతో చెట్లు ఏర్పాటుచేశారు. వాటి నిర్వహణ సక్రమంగా లేక ఎండిపోయే దుస్థితి నెలకొంది. మధ్యలో పిచ్చిమొక్కలు పెరిగాయి. పచ్చదనం పెంచుతూ.. అందంగా తీర్చిదిద్దుతామన్న అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో ఎటుచూసినా కళావిహీనంగా కనిపిస్తున్నాయి.



కొత్తబస్టాండ్ వద్ద అధ్వానంగా జంక్షన్, పనిచేయని ఫౌంటేన్

పట్టింపేది..?

అసలే జిల్లా కేంద్రం. నిత్యం వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వస్తుంటారు. ఈ మధ్యనే జంక్షన్ల వద్ద ట్రాఫిక్ లైట్స్ ఏర్పాటు చేశారు. జంక్షన్లుగానీ, డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన మొక్కలపై నిర్వహణ చర్యలు తీసుకోకపోవడంతో విపరీతంగా పెరిగాయి. వాటి మధ్య పిచ్చిమొక్కలూ పెరిగిపోయాయి.

ఎన్విరాన్‌మెంట్ అధికారులెక్కడ?

హరితహారం కార్యక్రమంలో భాగంగా చెట్లను అందంగా తీర్చిదిద్దడంతోపాటు, వాటిని రక్షించేందుకు ఎన్విరాన్‌మెంట్ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. కానీ వారు మచ్చుకు కన్పించడం లేదనే ఆరోపణలున్నాయి. వీరు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకుని మొక్కలు నాటించడంతోపాటు, పిచ్చిమొక్కలను తొలగిస్తూ.. ఎప్పుడూ మొక్కలకు నీరు పోస్తుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సుందరీకరణపై శ్రద్ధ పెట్టి ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించడంతోపాటు, ఫౌంటేన్లను పునఃప్రారంభించాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించండి

- కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలెక్టర్ సత్యప్రసాద్‌కు సూచించారు. ఇంకా మిగిలిన 859 ఇళ్లను అర్హులకు ఇంతవరకు లబ్ధిపొందని వారికి.. గతంలో 2008లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై అసంపూర్తిగా వదిలేసిన వారికి కేటాయించాలని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మిగిలిపోయిన అంతర్గత పనులు, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాశారు. ఇస్లాంపురకు చెందిన సయ్యద్ ఫజుల్‌కు రూ.21,500 విలువైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కు అందించారు. ఎమ్మెల్యేను మిషన్ భగీరథ ఈఈ జానకి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ధరూర్ క్యాంప్‌లోని కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. వసతులు, స్టోర్‌రూమ్, వంటగది శుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు సుధాకర్, పృథ్వీ, ప్రశాంత్‌రాజ్, రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ కవిత పాల్గొన్నారు.

వ్యక్తి పేరుతో ఊరు.. వంశమంతా ఒకటే తీరు

వెల్గటూర్ : అది ఎండపల్లి మండలంలో రాజారాంపల్లి. ఆ గ్రామానికి ఆ పేరు రావడానికి ఒకటే కారణం.. గ్రామానికి చెందిన ఏలేటి రాజారాంపటేల్ ఆ ఊరుకు చేసిన సేవ. ఆయన పేరునే గ్రామానికి పెట్టుకున్నారు. పాఠశాల, పంచాయతీ కార్యాలయం, దేవాలయాలు, సమ్మక్క, సారలమ్మ జాతర స్థలం, శ్మశాన వాటిక, డంపింగ్‌యార్డు, వాటర్ ట్యాంకులు, అంగన్‌వాడీ కేంద్రం, మహిళాసంఘం భవనం ఇలా అన్నీ ఏలేటి వంశీయుల జ్ఞాపకాలే. ఓ పదివేలు దానం చేసి వంద మందితో సన్మానాలు చేయించుకునే ఈ రోజుల్లో గ్రామ అభివృద్ధికి కోట్ల విలువైన స్థలాలు గ్రామానికి అప్పగించారు ఏలేటి వంశీయులు. తాజాగా మండలకేంద్రానికి సంబంధించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు, ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణానికి స్థలం కేటాయించాలని గ్రామస్తులు ఏలేటి వంశస్థులను కోరగా.. సుమారు రూ.ఐదుకోట్ల విలువైన భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏలేటి రాజారాంపటేల్ విగ్రహానికి గ్రామస్తులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. గ్రామ అభివృద్ధికి ముందుకొచ్చిన ఏలేటి వంశస్థులు సత్యనారాయణ రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, శైలేందర్ రెడ్డి, విజయ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రాజారాంపటేల్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మద్యం దుకాణాలకు 135 దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని 71 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 135 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెంటెండ్ సత్యనారాయణ తెలిపారు. దరఖాస్తులు తీసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.



'ఇందిరమ్మ' ఇళ్లు పూర్తికావాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గృహనిర్మాణం, మున్సిపల్ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. జిల్లాకు 10,982 ఇళ్లు మంజూరు కాగా.. 7,343కు మార్క్‌అవుట్ చేశామని, 2,984 బేస్‌మెంట్, 721 లెంటల్, 369 స్లాబ్ దశకు వచ్చాయని, మూడు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా 22వ స్థానంలో ఉందని, అధికారులు సమన్వయంగా పనిచేసి మొదటి ఐదు స్థానాల్లో ఉండేలా చూడాలన్నారు. ఇసుక బజార్ నుంచి లబ్ధిదారులు ఇసుక పొందవచ్చన్నారు. బిల్లుల్లో జాప్యం ఉన్నా, సమస్యలున్నా తన దృష్టికి తేవాలన్నారు. అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, డిప్యూటీ అదనపు కలెక్టర్ హారిణి, హౌసింగ్ పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

కార్డియక్ అరెస్ట్‌తోనే మరణాలు

కార్డియక్ అరెస్ట్‌తోనే యుక్త వయస్సులో చాలామంది చనిపోతున్నారని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కార్డియో పల్మనరి రిసాసిటేషన్ వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్నిచోట్ల వారంపాటు అవగాహన కల్పిస్తామన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందన్నారు. పెన్షన్లను రూ.4వేలకు పెంచకపోవడం, ఆడపిల్ల వివాహానికి తులం బంగారం అందజేయకపోవడం, పూర్తి స్థాయిలో రూ.2లక్షల రుణమాఫీన అమలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగకు మహిళలకు చీరెలు అందించి గౌరవిస్తే.. కాంగ్రెస్ ఆ ప్రక్రియను నిలిపివేసి కించపరిచిందన్నారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారన్నారు. రాబోయే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదని స్పష్టం చేశారు.



విద్యాసాగర్‌రావు

కాంక్రీట్ పిల్లర్ల రాజన్న మండపం

- యాదాద్రి తరహాలో రాయి శిలలు వాడటం లేదా..?
- రాతితో ప్రాచీన పరంపర ప్రతిబింబిస్తుందంటున్న భక్తులు
- పిల్లర్లకు పలకలు వేసినా నాణ్యంగానే ఉంటాయంటున్న అధికారులు
- సమ్మక్కకు ముందు రాజన్న దర్శనంపై అపోహలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ పునర్ నిర్మాణం, అభివృద్ధి విషయంలో ఇప్పటికే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణం ఎలా సాగుతోందనే అంశం తెరపైకొచ్చింది. యాదాద్రి ఆలయాన్ని కృష్ణశిల రాయితో నిర్మించినట్టుగానే ఇక్కడ జరిగేనా లేక పిల్లర్లతో నిర్మిస్తారా? అనే చర్చ సాగుతోంది. సుమారు 70 పిల్లర్లతో స్లాబు వేసి రాజన్న ఆలయ మండపం నిర్మించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆలయ పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.76కోట్లను మంజూరు చేసింది. యాదాద్రి ఆలయ నిర్మాణానికి రూ.300 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేసింది. దీన్ని బట్టి చూస్తే యాదాద్రి తరహాలో రాజన్న ఆలయ నిర్మాణం పూర్తయ్యేనా అనే అపోహలు భక్తుల్లో నెలకొన్నాయి. దీనిపై ప్రభుత్వం, దేవాదాయశాఖ స్పష్టమైన వివరణ ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

పీఠాధిపతి రాకతో అపోహలు తొలగేనా?

ఈనెల 19న శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేకర భారతిస్వామి వేములవాడ ఆలయాన్ని సందర్శించి సలహాలు, సూచనలు అందించనున్నారు.



యాదాద్రిలో రాతి పిల్లర్ల నిర్మాణం (ఫైల్)

ఈనేపథ్యంలో పీఠాధిపతి రాకతోనైనా ఆలయ నిర్మాణం విషయంలో స్పష్టత వచ్చేనా అని భక్తులు, స్థానికులు ఎదురుచూస్తున్నారు. స్వామీజీ సూచనల మేరకే దేవాదాయశాఖ ఆలయ పునర్ నిర్మాణ విషయంలో మాస్టర్‌ప్లాన్ బ్లూప్రింట్ సిద్ధం చేసింది. ఇందులో పిల్లర్లతో నిర్మాణం చేపడుతున్నట్లు భక్తులు చర్చించుకుంటున్నారు. ఇదే కొనసాగితే రాజన్న ఆలయ ఆధ్యాత్మికతకు భంగం కలిగే అవకాశం ఉందని భక్తులు పేర్కొంటున్నారు. అలాగే ప్రాచీనతకు అద్దం పట్టినట్లు ఉండే రాజన్న ఆలయ రూపురేఖలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. యాదాద్రి ఆలయాన్ని ఆధ్యాత్మికతకు అద్దం పట్టేలా నిర్మించారు. అంతకంటే పురాతన చరిత్ర గల రాజన్న ఆలయాన్ని అలాంటి శైలిలోనే నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. కాకతీయుల కాలం నాటి ప్రాచీన ఆలయానికి ఆధునిక పిల్లర్లు కట్టి, వాటికి రాతి పలకలు అద్దితే నాణ్యత ఎంత కాలం ఉంటుందనే విషయంపైనా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేశ్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. కాంక్రీట్ పిల్లర్లతో మండప నిర్మాణం వాస్తవమేనని, ఆ పిల్లర్లకు రాతి పలకలు తొడుగుతామన్నారు. దీని నాణ్యత చాలాకాలం ఉంటుందని స్పష్టం చేశారు.

భక్తులకు దర్శన భాగ్యం కలిగేనా?

రాజన్న ఆలయ పునర్నిర్మాణం జరిగే సమయంలో భక్తులకు దర్శన భాగ్యం కలిగేనా లేక నిలిపివేస్తారా? అని అనుమానాలు ఉన్నాయి. దేవాదాయశాఖ అధికారులు నిర్మాణ సమయంలో స్వామివారికి ఏకాంత సేవలు మాత్రమే కొనసాగిస్తామని స్పష్టం చేయడంతో భక్తులకు రాజన్న దర్శనం కలిగేనా అనే అపోహలు నెలకొన్నాయి. నిర్మాణ సమయంలో భక్తులకు భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు ఉంటాయని, ఉత్సవ విగ్రహాలను మూడు రోజుల క్రితమే తరలించారు. కోడెమొక్కులు కూడా భీమేశ్వరాలయంలోనే ఏర్పాటు చేశారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు భక్తులకు రాజన్న ఆలయం నిర్మాణ సమయంలో దర్శన అవకాశం కల్పించాలని ఆందోళన చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో రమాదేవి ఆలయం మూసివేత ఉండదని, ఆలయంలో జరిగే ఏకాంత పూజలు యథావిధిగా కొనసాగుతాయని వివరణ ఇచ్చారు. అయినప్పటికీ యాదాద్రి కానీ, కాణిపాకం ఆలయంలో గానీ పునర్నిర్మాణ విషయంలో భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు. ఇక్కడ అందుకు విరుద్ధంగా దర్శనాలు నిలిపివేయడం సరికాదంటున్నారు. మేడారం సమ్మక్క జాతర సందర్భంగా ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ.. అని ఇలాంటి సమయంలో దర్శనం విషయంలో గందరగోళం కలిగించే ప్రకటనలు సరికాదని హితవు పలుకుతున్నారు.

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి భారీగా తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించినకలెక్టర్ సత్యప్రసాద్
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లానలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. కలెక్టర్ సత్యప్రసాద్ వారి నుంచి అర్జీలు స్వీకరించారు. 55 అర్జీలు రాగా.. పరిశీలించిన ఆయన సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు లత, రాజాగౌడ్, జగిత్యాల, మెట్‌పల్లి కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జివాకర్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

చెరువుల్లో పూడిక తీయించండి



మాది జగిత్యాల రూరల్ మండలం నాగునూర్. గ్రామంలో నాగులకుంట, బొట్లకుంట చెరువుల్లో పూడిక పేరుకుపోయింది. చెరువు సామర్థ్యం తగ్గి సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బందిగా మారింది. ఈ చెరువుల కింద వంద ఎకరాలు సాగవుతుంది. పూడిక పేరుకుపోయి బావులు, బోర్లు వట్టిపోతున్నాయి. చెరువుల్లో పూడిక తీస్తే కొంత మేలు జరుగుతుంది.

– నాగునూర్ గ్రామ రైతులు

సన్నవడ్ల బోనస్ ఇప్పించండి



రైతుల నుంచి కొన్న సన్న ధాన్యం బోనస్ ఇప్పటికీ చెల్లించలేదు. నెలలుగా ఎదురుచూస్తున్నాం. మా ఖాతాల్లో బోనస్ మాత్రం జమ కావడం లేదు. వానాకాలం పంట కోతకు వచ్చింది. యాసంగిలో కొన్న వడ్లకు మాత్రం బోనస్ ఇప్పటివరకు రాలేదు.

– రైతు ఐక్యవేదిక ప్రతినిధులు

భారంగా దహన సంస్కారాలు



పేదలు ఎవరైనా మరణిస్తే జిల్లా కేంద్రంలోని శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలు మోయలేని భారంగా మారాయి. కట్టెలు ఇతర సామగ్రికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు అవుతోంది. ఆ ఆర్థిక భారాన్ని మోయలేక పేదలు ఇబ్బంది పడుతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో అమలు చేస్తున్న విధంగా రూపాయికే దహన సంస్కారాల పథకాన్ని ఇక్కడా అమలు చేయండి.

– భారత్ సురక్షా సమితి సభ్యులు

వైన్‌షాపును తరలించండి



జిల్లాకేంద్రలోని 20వ వార్డు బైపాస్‌రోడ్డులో ఇంటి నంబర్ 1-2-206/1లో రెండేళ్ల క్రితం ఆర్‌ఆర్‌ఆర్ వైన్ షాపు ఏర్పాటు చేశారు. జనావాసాల్లో ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. పర్మిట్ రూంలో మద్యం సేవిస్తున్న కొందరు మత్తులో గొడవలు, అల్లర్లకు దిగుతున్నారు. పార్కింగ్ స్థలం లేక రోడ్డుపై, షాపులు, ఇళ్లముందే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వద్దంటే గొడవకు దిగుతున్నారు. వైన్ షాపును వేరేచోటుకు తరలించండి

– 20వ వార్డు ప్రజలు, జగిత్యాల

శ్మశాన వాటిక వివాదం పరిష్కరించండి

రాయికల్‌లోని ఎర్రకుంట వద్ద గల సర్వే నంబర్ 740లోని 15గుంటల భూమిని మా పూర్వీకుల నుంచి రెవెన్యూ రికార్డుల్లో గోసంగి కుల సంఘం పేరిట నమోదై ఉంది. అక్కడ శ్మశానవాటికగా ఉపయోగిస్తున్నాం. ఆ భూమికి ఓ వ్యక్తి తప్పుడు ధ్రువీకరణపత్రాలతో తనదంటూ రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాడు. మోఖాపై విచారించిన అధికారులు కూడా ఆ భూమి మాదేనని తేల్చారు. కానీ.. సదరు వ్యక్తి ఆ స్థలం తనదేనంటూ బెదిరిస్తున్నాడు. ఆ భూమిని భూభారతి ఆన్‌లైన్‌లో నమోదు చేయించి శాశ్వత పరిష్కారం చూపండి. – గోసంగి కులస్తులు, రాయికల్



నా వాటా భూమి ఇప్పించండి



తన ఇద్దరు పిల్లలతో ప్రజావాణిలో కోటి లాస్య

నా పేరు కోటి లాస్య. మాది కోరుట్ల మండలం మోహన్‌రావుపేట. భూ తగాదాలతో మా మామ, మరిది, మరో ఆరుగురు కలిసి నా భర్త కోటి రాజేశ్‌ను ఏడాది క్రితం హత్య చేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన నాపైనా దాడి చేశారు. నా చేయి విరిగిపోయింది. అప్పటినుంచి నా భర్తకు రావాల్సిన భూమి వాటాను మరిది రాకేశ్ ఆక్రమించి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడు. భర్త మరణంతో నేను నా ఇద్దరు పిల్లలు దిక్కులేని వాళ్లమయ్యాం. సమభాగం ఇవ్వాల్సిన ఇంట్లోకి రానీయడం లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నం. పిల్లల పోషణ, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నా భర్తకు రావాల్సిన వాటా భూమి ఇప్పించి న్యాయం చేయండి.

క్లుప్తంగా

నీటిలో మునిగి వ్యక్తి మృతి



బండారి వెంకటయ్య మృతదేహం

ఇల్లంతకుంట(మానకొండూర్): మానేరువాగులో స్నానం చేసి బయటకు వస్తుండగా ఫిట్స్ వచ్చి నీటిలోనే వ్యక్తి చనిపోయిన సంఘటన పొత్తూరులో విషాదం నింపింది. మండలంలోని పొత్తూరుకు చెందిన బండారి వెంకటయ్య(48) కొంత కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం హమాలీ పనులు ముగించుకున్న తర్వాత గ్రామ పొలిమేరలోని మానేరు వాగులో స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగానే వెంకటయ్యకు ఫిట్స్ వచ్చి నీటిలోనే పడి మృతిచెందాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మానేరువాగు వైపునకు వెళ్లిన గ్రామస్తులు వెంకటయ్య మృతదేహం చూసి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై జి.లక్పతి తెలిపారు. మృతునికి కొడుకు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..

- ఢీకొట్టి వెళ్లిపోయిన గుర్తు తెలియని వాహనం



మారుపాక వినోద్ (ఫైల్)

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్, మోహన్‌రావుపేట గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొని పట్టణానికి చెందిన మారుపాక వినోద్ (28) అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం వినోద్ వ్యవసాయ బోర్లు మరమ్మతు చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం కోరుట్ల నుంచి మోహన్‌రావుపేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతోతల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వినోద్‌కు భార్య, ఏడాది కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మెట్‌పల్లి రూరల్: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో కరీంనగర్‌లోని రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ ప్రదర్శన, పంటల్లో యాజమాన్య పద్ధతులపై సోమవారం రైతు సదస్సు నిర్వహించారు. ఆధునిక కేతిక విధానాలను రైతులు అందుకోవాలన్నారు. ఎరువులు మోతాదులో వాడాలని, పంట అవశేషాలను తగలబెట్టకూడదని, మెలకువలు పాటించి అధిక దిగుబడి పొందాలని పేర్కొన్నారు. రైతు విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ హరికృష్ణ, శాస్త్రవేత్తలు మదన్‌మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాంప్రసాద్, ఉమారాణి, భారతీనారాయణ భట్, అరుణ్‌బాబు, డీఏవో భాస్కర్, ఏవో దీపిక, ఏఈవో అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సాంకేతికత అలవర్చాలి



మాట్లాడుతున్న డీఈవో రాము

జగిత్యాల: విద్యార్థుల్లో సాంకేతికత అలవర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ లిటరసి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు క్షుణ్ణంగా తెలుసుకుని వారికి వివరించాలని డీఈవో రాము అన్నారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు డిజిటల్ లిటరసిపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే కోడింగ్, ప్రోగ్రామింగ్‌లో ప్రాథమిక అభ్యాసంతో నైపుణ్యం అలవర్చేలా చూడాలన్నారు. కో–ఆర్డినేటర్ రాజేశ్, ఈశా స్కూల్ ఆఫ్ నాలెడ్జ్ చైర్మన్ కంది కైలాసం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వెంకట్రావ్‌పల్లెలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోతిరెడ్డిపేటకు చెందిన గీత కార్మికుడు చింత సమ్మయ్య (46) బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సమ్మయ్య తలకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొట్టిన వాహనదారుడు మెట్‌పల్లి గ్రానైట్ క్వారీలో పనిచేసే వ్యక్తిగా భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

భీమన్న సన్నిధి.. భక్తుల సందడి

- బాలాలయంలో రాజన్న దర్శనాలు
- కోడెమొక్కుల చెల్లింపులు
- సౌకర్యాలపై భక్తుల సంతృప్తి
- రాజన్న ఆలయం అభివృద్ధిపై హర్షం



వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో భీమన్న ఆలయంలో దర్శనం, కోడెమొక్కులకు కల్పించిన సౌకర్యాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాలాలయంలో దర్శనాలకు ఏర్పాట్లు బాగున్నాయని.. కోడెమొక్కులు సైతం ఇక్కడే చెల్లించుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 11న స్వామి వారి ఉత్సవమూర్తులను భీమన్నగుడిలోని బాలాలయంలో ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇక్కడే దర్శనాలు, కోడెమొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తున్నారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. అదే సమయంలో భీమన్నగుడిలో చేసిన ఏర్పాట్లపై సంతృప్తిగా ఉందన్నారు. భీమన్నగుడిలో దర్శనాలు పూర్తి చేసుకున్న భక్తులు 'సాక్షి'తో మాట్లాడారు. వారి మాటల్లోనే..

దర్శనం బాగా అయ్యింది



రాజన్న గుడిని విస్తరిస్తున్న క్రమంలో భీమన్నగుడిలో దర్శనాలు ఏర్పాటు చేయడం బాగుంది. ఇక్కడే దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాం. భీమన్నగుడిలోనూ సౌకర్యాలు బాగా కల్పించారు. ఎన్నో ఏండ్లకు వేములవాడ రాజన్న గుడి అభివృద్ధి జరుగుతోందంటే సంతోషంగా ఉంది.

– కాటం సత్యం, లక్ష్మి, సెంటినరీకాలనీ

అభివృద్ధికి అందరూ సహకరించాలి



రాజన్న గుడి విస్తరణ పనుల్లో భాగంగా భీమన్నగుడిలో దర్శనాలకు మంచి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి. అందరూ అధికారులకు సహకరిస్తే భవిష్యత్‌లో రాజన్న ఆలయం చరిత్రలో నిలిచిపోయేలా తయారవుతుంది.

– మహిపాల్‌రెడ్డి, కొత్తగూడెం, జనగామ జిల్లా

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



రాజన్న దర్శనానికి వస్తే భీమన్న గుడిలో దర్శనం చేసుకోవాలన్నారు. భీమన్నగుడికి వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాలు సాగాయి. రాజన్న ఆలయ విస్తరణ పనులు చేపడుతున్న ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– మహేశ్వర్, ముజ్యాల్, నిర్మల్

అభివృద్ధి చేయడం మంచిదే..



మాది వంగర. నేను అమెరికాలో ఉంటున్నాను. అమెరికా నుంచి వచ్చినప్పుడల్లా రాజన్నను దర్శించుకుంటాను. ఎన్నో ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆలయాన్ని ఇప్పుడు విస్తరించడం చాలా సంతోషం. భీమన్న గుడిలో సౌకర్యాలు బాగానే ఉన్నాయి. అందరూ సహకరిస్తే రాజన్న గుడి ప్రఖ్యాతి చెందుతుంది.

– చంద్రసేన, వంగర, ఎన్‌ఆర్‌ఐ

భవిష్యత్‌లో మరింత ప్రాచుర్యం



మాది హైదరాబాద్. మేము చిన్నప్పటి నుంచి రాజన్న దర్శనానికి వస్తుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి డెవలప్‌మెంట్ జరుగలేదు. ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. భవిష్యత్‌లో రాజన్న గుడి మరింత ప్రాచుర్యం పొందే అవకాశం ఉంది. అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవు. అందరూ సహకరిస్తే మంచిది.

– రాధిక, శివరాజ్, హైదరాబాద్

రాజన్న గుడి మూసివేస్తారనేది అబద్ధం



రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా గుడిని మూసివేస్తారన్న ప్రచారం అబద్ధం విస్తరణ పనులు జరుగుతుండగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు భీమన్నగుడిలో దర్శనాలు ఏర్పాటు చేశాం. రాజన్న ఆలయంలో చతుష్కాల పూజ లు, కైంకర్యాలు యథావిధిగా జరుగుతాయి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు.

– రమాదేవి, ఆలయ ఈవో

తాళంవేసిన నాలుగిళ్లలో చోరీ

- బంగారం, నగదు, బైక్ ఎత్తుకెళ్లిన దొంగలు



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక దొంగలు తాళం వేసిన నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఓ ఇంటి నుంచి ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన వెన్నం శ్రీనివాస్ దుబాయ్‌లో ఉంటున్నాడు. ఆయన భార్య ఇంటికి తాళంవేసి ఊరు వెళ్లింది. ఆ ఇంట్లో నుంచి సుమారుడు మూడు తులాల బంగారం, 41 తులాల వెండి ఎత్తుకెళ్లారు. షేక్ షబానా ఇంట్లో నుంచి మూడున్నర తులాల బంగారం, 12 తులాల వెండి, రూ.50 వేలు, ద్యాగల నరేశ్ ఇంటి నుంచి రూ.1.70 లక్షలు, మూడు గారు గొలుసులు, మంథని కవిత ఇంట్లో చొరబడి బంగారం ఎత్తుకెళ్లారు. గుమ్ముల రాజేశం ఇంట్లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుల ద్వారా విషయం తెలుసుకున్న రూరల్ సీఐ సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలించారు. సోమవారం ఉదయం 2.30 గంటల నుంచి 3 గంటల సమయంలో దొంగతనం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎస్పీ పైలట్ వాహనంలో ఆస్పత్రికి..

- ప్రమాదాన్ని గమనించి ఆగిన ఎస్పీ
- తన వాహనంలో ఆస్పత్రికి తరలింపు



చర్యలకు ఆదేశిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్ రోడ్డులో ప్రమాదవశాత్తు గాయపడ్డ వ్యక్తిని ఎస్పీ మహేశ్ బీ గీతే తన పైలట్ వాహనంలో ఆస్పత్రికి పంపించారు. సోమవారం బైపాస్‌రోడ్డుపై వెళ్తున్న ఎస్పీకి ప్రమాదంలో గాయపడ్డ అశోక్‌నగర్‌కు చెందిన రఫీక్‌పాషా కనిపించారు. వెంటనే తన వాహనాన్ని నిలిపి క్షతగాత్రులను తన వాహనంలో సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలింపజేశారు.

బంగారం కోసమే విష ప్రయోగం

- వీడిన గర్శకుర్తి వృద్ధ దంపతుల మిస్టరీ
- మత్తు మాత్రలు ఇచ్చిన తెలిసిన వ్యక్తి
- ఆపై బంగారం అపహరణ
- కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం



వివరాలు వెల్లడిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తిలో వృద్ధ దంపతులపై విషప్రయోగం మిస్టరీ వీడింది. ఈ ఘటనలో వృద్ధుడు చనిపోగా.. వృద్ధురాలు ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. తెలిసిన వ్యక్తే బంగారం కోసం మత్తు మాత్రలు ఇవ్వగా.. నిందితుడిని గంగాధర పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను సీపీ గౌస్ ఆలం సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో వెల్లడించారు. గర్శకుర్తి గ్రామానికి చెందిన గజ్జెల శంకరయ్య– లక్ష్మీ దంపతులు ఇంట్లో ఇద్దరే ఉంటారు. వారి ఇంటికి సమీపంలో ఉండే కత్తి శివ(37) వృద్ధులకు చేదోడుగా ఉంటూ మందులు తేవడం, ఇతర పనులు చేస్తుండేవాడు. శివకు పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ ఆడడంతో అప్పులయ్యాయి. అప్పు తీర్చేందుకు దంపతుల వద్ద బంగారం కాజేయాలని నిర్ణయించాడు. గతంలో ముంబైలో కల్లుడిపోలో పనిచేసిన సమయంలో అందులో వాడే మత్తు టాబ్లెట్లు వెంట తెచ్చుకున్నాడు. ఈ నెల 7వ తేదీన వృద్ధులకు అనారోగ్యం ఉండడంతో మత్తు టాబ్లెట్లు ఇచ్చాడు. అవి వేసుకుంటే జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు తగ్గుతాయని నమ్మించాడు. మాత్రలు వేసుకుని సొమ్మసిల్లిన రెండు గంటల తర్వాత ఇంట్లోకి వెళ్లి లక్ష్మి మెడలోని బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. అదే గ్రామంలోని కట్ల శ్రీనివాసాచారికి విక్రయించి, రూ.1.85 లక్షలు తీసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న గంగాధర పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శివపై అనుమానంతో అతని కదలికలపై నిఘా పెంచారు. సోమవారం గర్శకుర్తి శివారులో అదుపులోకి తీసుకున్నారు. తానే వృద్ధులకు మత్తుమాత్రలు ఇచ్చి, బంగారం చోరీ చేశానని ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.25వేల నగదు, 11మత్తు మాత్రలు, సెల్‌ఫోన్, కట్ల శ్రీనివాసాచారి నుంచి పుస్తెలతాడు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ చారి, కానిస్టేబుళ్లు జంపన్న, అరవింద్‌ను సీపీ అభినందించి రివార్డు అందించారు.

భవనం పైనుంచి తోయడంతో ఒకరు మృతి

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ శివారులోని బ్రీడింగ్ అండ్ హెచరీస్ ప్రైవేటు కంపెనీలో పేయింటింగ్ పనిచేస్తున్న దాసో సోరెన్ (32)ను తోటి పేయింటర్ భవనం పైనుంచి తోయడంతో కిందపడి చనిపోయాడు. చిగురుమామిడి ఇన్‌చార్జి ఎస్సై స్వాతి వివరాల ప్రకారం.. సోరేన్‌ను 15 రోజుల క్రితం పశ్చిమ బెంగాల్ నుంచి కాంట్రాక్టర్ ఎస్‌కే.అర్షద్ పేయింటింగ్ వేసేందుకు తీసుకొచ్చాడు. ఇతనితో పాటు ముస్లింఖాన్ కూడా వచ్చాడు. ఆదివారం రాత్రి ఇరువురు డబ్బుల విషయంలో గొడవపడ్డారు. మాటమాట పెరిగి ముస్లింఖాన్ సోరెన్‌ను భవనం పైనుంచి కిందకు తోసేశాడు. తీవ్రంగా గాయపడిన సోరెన్‌ను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే చనిపోయాడు. అర్షద్ ఫిర్యాదుతో తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ సోమవారం శవపంచనామా నిర్వహించి, కేసు నమోదు చేశారు.

రాజన్న ఆలయ పరిసరాల్లోనే దర్శనం

- బండి సంజయ్‌తో ఫలించిన దేవాదాయశాఖ అధికారుల చర్చలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: భీమన్న గుడిలో కాదు.. రాజన్న ఆలయ పరిసరాల్లోనే భక్తులకు దర్శనం కల్పించనున్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, దేవాదాయశాఖ అధికారులతో సోమవారం ఈ విషయంపై చర్చించారు. కోడెమొక్కుల చెల్లింపు అనాదిగా వస్తోన్న ఆచారమని, భక్తుల మనోభావాలకు విరుద్ధంగా భీమన్న ఆలయాన్ని అంగీకరించేది లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. భక్తు ల మనోభావాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే 30 వేల మంది బీజేపీ కార్యకర్తలతో 15 రోజులపాటు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మేడారం జాత ర దృష్ట్యా, రాజన్న భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బండి సంజయ్ సూచనలను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారని, అవసరమైతే ఎల్‌ఈడీ స్క్రీన్, తాత్కాలి క ఏర్పాట్లతో భక్తులు దర్శనం చేసుకునేలా ఏర్పా ట్లు చేస్తామని సిరిసిల్ల డీపీఆర్వో కార్యాలయం ప్రకటన జారీ చేసింది.

ఆర్థిక నేరగాళ్ల ఆస్తులు జప్తు చేయాలి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: క్రిప్టో కరెన్సీ మోసాలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి కోరారు. అధిక లాభాలు, విదేశీ టూర్ల ఆశతో బిట్ కాయిన్, మెటాఫండ్‌వంటి యాప్‌ల ద్వారా ప్రజల నుంచి పెట్టుబడి పెట్టిస్తూ.. క్షణాల వ్యవధిలో ఆ యాప్‌లను తొలగిస్తూ మోసం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆర్‌బీఐ అనుమతి లేకుండా సాగుతున్న ఆన్‌లైన్ ఆర్థిక కార్యకలాపాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రత్యేక చొరవ తీసుకుని నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లలో పెట్టుబడి అరికట్టేలా చూడాలని కోరారు. నాయకులు బండ శంకర్, గాజంగి నందయ్య, మసర్తి రమేశ్, కల్లెపెల్లి దుర్గయ్య, మహ్మద్‌భారీ, మన్సూర్, చాంద్‌పాషా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

- వీధి వ్యాపారులకు వరం
- గడువు పెంపు

లోక కల్యాణ్ మేళా



వీధివ్యాపారులు

జగిత్యాల: పీఎం స్వనిధి స్థానంలో లోక కల్యాణ్ పేరిట కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. మొదట సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2 వరకు వీధివ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. కొత్తగా వీధి వ్యాపారాలు చేసుకునే వారికి సైతం అవకాశం కల్పించారు. గతంలో రుణాలు తీసుకున్న వారితో పాటు, కొత్తగా వ్యాపారం మొదలుపెట్టుకునే వారికి సైతం అవకాశం ఇస్తున్నారు. చాలా మంది కొత్తగా వీధివ్యాపారం చేసుకునే వారికి అవగాహన లేక ఈనెల 15 వరకు గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మున్సిపాలిటీల పరిధిలో..

మున్సిపాలిటీల్లో ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారాలు చేసుకునే వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి) పథకం ప్రవేశపెట్టింది. తొలి విడతలో రూ.10 వేలు, రెండో విడతలో రూ.20 వేలు, మూడో విడతలో రూ.50 వేలు అందించి, నాల్గో విడతకు వచ్చేసరికి ఈ పథకాన్ని ఆపేశారు. దీంతో ఇక రుణాలు వస్తాయో లేదోనన్న ఆందోళన చిరువ్యాపారుల్లో మొదలైంది. తాజాగా వీధివ్యాపారాలకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వనిధి రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది.

లోక్ కల్యాణ్ మేళా..

9 నెలల పాటు పీఎం స్వనిధి పథకం నిలిచిపోగా, ప్రస్తుతం లోక్ కల్యాణ్ మేళా పేరిట రుణాలు అందించనున్నారు. ఈనెల 15 వరకు దరఖాస్తుకు గడువు పెంచారు. ఇప్పటికే ఉన్నతాధికారులు మెప్మా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈసారి శిబిరాలు ఏర్పాటు చేసి పాతవారితో పాటు, కొత్తవారికి సైతం రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే మొదటి విడతలో రూ.10 వేలు ఇవ్వగా ప్రస్తుతం రూ.15 వేలకు పెంచారు. ఎవరైతే సక్రమంగా చెల్లిస్తారో వారికి రూ.20 వేలు ఇవ్వనున్నారు. గతంలో రుణం తీసుకుని సక్రమంగా చెల్లించిన వారుంటే వారికి రూ.50 వేలు అందిస్తారు. క్రెడిట్‌కార్డులు కూడా ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. రూ.లక్ష లిమిట్‌తో క్రెడిట్‌కార్డు వాడుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

డిజిటల్ ప్రోత్సాహం

చిరువ్యాపారులకు డిజిటల్ ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్స్ అందించారు. ప్రస్తుతం ప్రతీ చిరువ్యాపారి డిజిటల్ ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తున్నారు. కొత్త రుణాలు తీసుకునే వారికి త్వరితగతిన ప్రాసెసింగ్ చేయనున్నారు. లబ్ధిదారులు పీఎం స్వనిధి మొబైల్‌యాప్ ఇన్‌స్టాలేషన్‌తో పాటు, క్యూఆర్ కోడ్ పొందవచ్చు. మున్సిపల్ అ. దికారులు అర్హుల జాబితాను రూపొందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

లోక్ కల్యాణ్ మేళా గడువు ఈనెల 15 వరకు ఉంది. కొత్త, పాత వీధివ్యాపారులకు మంచి అవకాశం. రుణాలు తీసుకుని లబ్ధి పొందాలి. ప్రతీ మున్సిపాలిటీలో కార్యక్రమం చేపడతాం . విడతల వారీగా రుణం చెల్లిస్తే మళ్లీ అత్యధిక రుణాలు పొందే వీలుంటుంది.

– రాజాగౌడ్, అడిషనల్ కలెక్టర్

మున్సిపాలిటీల్లో కొత్త వీధివ్యాపారులు రుణ లక్ష్యం

బల్దియా	వ్యాపారుల లక్ష్యం	దరఖాస్తులు	ఉన్న వ్యాపారులు	మంజూరు
రాయికల్	25	61	88	50
ధర్మపురి	25	36	86	50
కోరుట్ల	25	67	147	50
మెట్‌పల్లి	32	62	48	50
జగిత్యాల	105	183	149	97

పాత వీధివ్యాపారులు ఇలా..

బల్దియా	వ్యాపారులు	లక్ష్యం	దరఖాస్తు	రుణం మంజూరు	ఇచ్చిన రుణాలు
జగిత్యాల	6,005	780	540	483	473
కోరుట్ల	4,081	539	210	154	145
మెట్‌పల్లి	3,548	384	239	206	204
రాయికల్	815	208	121	114	112
ధర్మపురి	858	199	150	107	102

అంజన్న హుండీ ఆదాయం రూ.1.08కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ట్రస్టు సభ్యులు

మల్యాల: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షకులు రాజమౌళి సమక్షంలో ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో శ్రీవేంకట అన్నమాచార్య సేవా ట్రస్టు సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు. 81రోజులకుగాను 12 హుండీలను లెక్కించగా.. రూ.1,08,72,591తోపాటు 55 విదేశీ కరెన్సీ సమకూరింది. మిశ్రమ వెండి, బంగారం తిరిగి బ్యాగుల్లో వేసి, సీల్ చేసి, హుండీలో భద్రపరిచారు. లెక్కింపులో దేశిని సునీల్‌కుమార్, నీల చంద్రశేఖర్, గుండి హరిహరనాథ్, ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌కు 'సీబీఎస్‌ఈ' అవార్డు



అవార్డు అందుకుంటున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్య, క్రీడారంగాల్లో అవలంబిస్తున్న విధి విధానాలకు గాను అల్ఫోర్స్ హైస్కూల్‌కు అత్యుత్తమ సీబీఎస్‌ఈ పాఠశాల అవార్డు లభించింది. హైదరాబాద్‌లో గ్లోబల్ ట్రెండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా కంక్లేవ్ సమావేశంలో ఈ అవార్డును అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అందుకున్నారు. విద్యారంగంలో అల్ఫోర్స్ విద్యా సంస్థలు చేస్తున్న కృషికి ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని వీఎన్‌ఆర్ తెలిపారు. నాణ్యమైన విద్య అందిస్తూ, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా ఐఐటీ, ఐఐఎం, ఎన్‌ఐటీ,, ఎయిమ్స్, మెడికల్ కళాశాలలు, సీఏ పరీక్షల ఫలితాల్లో సీట్లు సాధించేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అవార్డు అందుకోవడంపై యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నేతలు, యువజన, క్రీడా సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మల్యాల: మండలంలోని రాజారాం గ్రామానికి చెందిన ఓ వివాహిత వేధింపుల భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మెట్‌పల్లి మండలం వెల్లుల్లకు చెందిన సుమలతకు పదమూడేళ్ల క్రితం రాజారాంకు చెందిన గుర్రం నర్సయ్యతో వివాహమైంది. నర్సయ్య బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం దుబాయి వెళ్లాడు. సుమలత తన పిల్లలతో కలిసి రాజారంలోనే ఉంటోంది. సుమలత అత్తమామలు, ఆడబిడ్డలతోపాటు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి వేధింపులకు గురిచేయడంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సుమలత తండ్రి బోదాసు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరు మెటాఫండ్ ప్రో నిందితుల అరెస్ట్

జగిత్యాలక్రైం: మెటా ఫండ్‌ప్రో యాప్‌లో పెట్టుబడులు పెడితే మూడింతల డబ్బు వస్తుందని నమ్మించి మోసం చేసిన ఇద్దరు నిర్వాహకులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాధితుడు మెటాఫండ్ ప్రో యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన వరాల వెంకటేశ్వర్‌రావు, జగిత్యాల పట్టణానికి చెందిన కస్తూరి శ్యామ్‌సుందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సర్వేల ఆధారంగానే రన్‌వే

- అంతర్గాంలో విమానాశ్రయంపై నివేదిక
- అన్నీబాగుంటేనే అడుగుముందుకు
- ప్రారంభమైన వివిధ శాఖల సర్వే
- పక్కాగా ఆరంచెల విధానం అమలు



ప్రతిపాదిత విమానాశ్రయ స్థలం

రామగుండం: ఆరంచెల విధానంలో వచ్చే నివేదికల ఆధారంగానే అంతర్గాంలో విమానాశ్రయం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో చేపట్టిన ప్రీఫిజిబిలిటీ నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40.53 లక్షలు మంజూరు చేయడం ద్వారా ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తొలిఅడుగు పడినట్లు ఆశలు రేకెత్తుతున్నాయి. వివిధ విభాగాల అత్యున్నతస్థాయి నిపుణులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో ఆరుదశల్లో సర్వే చేపడతారని, తుది నివేదికను ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కి అందజేస్తారని అధికారులు చెబుతున్నారు. రూపొందించనున్నారు.

ఆరు దశల్లో..

విమానాశ్రయం ఏర్పాటు జాతీయ భద్రత, పర్యావరణం, రవాణా, ఆర్థిక, ప్రజావసరాలతో ముడిపడి ఉందని అంటున్నారు. తొలిదశలో ప్రయాణికుల డిమాండ్, వాణిజ్య అవసరాలు, రవాణా సౌకర్యాలపై ఆయా విభాగాల ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తారు. మలిదశలో స్థలం ఎంపికపై భౌగోళిక పరిస్థితులు, నేల స్వభావం, ఎత్తు, ప్రధాన పట్టణాలకుదూరం, రోడ్లు, రైలు కనెక్టివిటీ పరిశీలిస్తారు. మూడోదశలో భూమి ఎత్తుపల్లాలు, పర్వతాలు, లోయలు, నదులు, రోడ్లు, సరస్సుపై పరిశోధన చేస్తారు. నాలుగో దశలో పర్యావరణ ప్రభావంపై అధ్యయం చేస్తారు. ఐదోదశలో నిర్వాసితులకు పునరావాసం, ఉపాధి కల్పన, వ్యాపార, ప్రాంతీయ అభివృద్ధి ప్రభావంపై సర్వే చేస్తారు. ఆరోదశలో మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్, డైరెక్టర్ జనరల్ ఏవియేషన్ అథారిటీ, ఏఏఐ, కేంద్ర, రాష్ట్ర క్యాబినెట్ అత్యున్నత ప్రతినిధులతో డీపీఆర్ తయారీ, ఆర్థిక అంచనా, బడ్జెట్ ఆమోదం, నిర్మాణానికి తుది అనుమతులు, టెండర్ల విడుదల ద్వారా విమానాశ్రయానికి రన్‌వే సిద్ధమైనట్లు ప్రకటిస్తారు.

అభివృద్ధికి సహకారం



ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుంటుంది. ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తాం.

– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

ప్రాజెక్టు పూర్తి లక్ష్యం



రామగుండం పరిశ్రమలకు నిలయంగా ఉంది. ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై పార్లమెంట్‌లో గళం వినిపించా. ప్రాజెక్టు సాధన నా లక్ష్యం

– గడ్డం వంశీకృష్ణ, ఎంపీ, పెద్దపల్లి